# హేస్ట

అంజనీ ప్రసాద్



నాకున్న కొద్దిపాటి సామానన్ని ఆ రెండు గదుల పోర్షన్‌లో నీట్‌గ సర్ది, విశ్రాంతిగ కుర్చీ మీద వాలి సిగరెట్ వెలిగించి, టైమ్ చూసేసరికి ఇంకా నిండా ఏడుకూడా కాలేదు. నాకీ వూరు ట్రాన్స్‌ఫర్ కాగానే ఇక్కడెలా ఉంటుందో, ఇల్లా అదీవెంటనే దొరుకుతుందో లేదోనని కంగారు పడ్డ నేను, మా "హైస్కూలు హనుమంతు" ఇక్కడి ఆఫీసు లోనే సూపర్‌వైజరని తెలీగానే 'హమ్మయ్య' అనుకున్నా. వాడి పలుకుబడి అనండి లేదా ప్రతాపం అనండి మూడ్రోజు ల్లోనే. ఒంటరిగాడి నైన నాకు వద్దన్నా వినకుండా మంచి పోర్షన్ చౌక అద్దెలో చూశాడు.

"నా కసలు పోర్షన్ ఎందుకురా? నే నొక్కణ్ణేగా" అన్నా.

"ఇక్కడి ఆఫీసులో చేరగానే నీకు ఆటోమేటిగా పోర్షన్ అవసర మొస్తుందోయ్" అన్నాడు ముసి ముసిగ నవ్వుతూ.

నువ్వనేదేమిటో నా కర్థం కావట్లే దనగానే నా ్రోజులు పోనీ నీకే తెలుస్తుం దన్నాడు. నాకు పిచ్చెక్కించక అసలు సంగ తేమిటో చెప్పరా అని రెట్టించాక—

హనుమంతు గట్టిగా ఒక దమ్ము లాగి, "మన ఆఫీసులో ఎంత అందమైన అమ్మాయి లున్నారూ అంటే నువ్వాళ్ళని చూడగానే ఇట్టే ప్రేమలో పడి. . . తరవాత రిజిస్ట్రరు మారేజీ. . . వేరే పోర్షనూ అంటూ నువ్వేలాగు మొదలెడతావ్. ఆ గొడవంతా దేని కని ముందుగానే నీకు పోర్షన్ చూశేశానోయ్" అన్నాడు పెద్ద సస్పెన్స్ విడదీస్తూ.

ఆ మాట వినగానే నాకు చిరాకు వేసింది. వాడేసిన జోక్ బోరు కొట్టి కాదు. "ఇంకీ జన్మకి 'ప్రేమ' లాంటివేమీ ఉండవురా" అని సీరియస్‌గ వాడికి చెబుదామనుకుని, మళ్ళా వాడి కిప్పుడో పెద్ద కథ చెప్పాల్సొస్తుందని భయపడి.

"పోరా పిచ్చి కబుర్లూ నువ్వూనూ. ఏదో చౌగ్గా దొరికిందని 'ఊ' అన్నా కాని, లేకపోతే నాకు పోర్షనెందుకురా" అని చెప్పి అక్కడితో వాణ్ణి వదిలించుకున్నాను.

ఒకసారి బాల్కనీ లోకి వచ్చి రోడ్డు మీద వచ్చే పోయే వాళ్ళను కాసేపు పరికించి మళ్ళా కుర్చీలో వచ్చి కూలబడ్డాను. ఆఫీసుకెళ్ళే లోపు ఏం చెయ్యాలో తోచలేదు.

పక్క పోర్షన్‌లో ఎవ్వరో ఉన్నట్టున్నారు అలికిడేమీ లేదేమిటబ్బా? అనుకున్నాను నా అనుమానానికి. సమాధానంగా అన్నట్టు పక్క నుంచి అప్పుడే కేకలు వినబడటం మొదలయింది. భర్త గట్టిగ దేన్ని గురించో [illegible] చేస్తున్నాడు. ఆమె కాస్త నెమ్మదిగా సమాధాన [illegible]ది.

[illegible]డ గొంతు వినగానే ఒక్కసారి ఉలిక్కి పడి చెవులు రిక్కరించి మరోసారి విన్నాను. సందేహం లేదు. అది రాజేశ్వరి గొంతే. కాని సంవత్సరంన్నర క్రితమే పెళ్ళయి భర్తతో వెళ్ళి పోయిన రాజేశ్వరి నా కోసమే అన్నట్టుగ ఇక్క డెందుకుంటుంది? అయినా రాజేశ్వరి లాంటి గొంతు ఇంకెంతమంది ఆడవాళ్ళ కుండదు అని సమాధాన పడ్డాను.

రాజేశ్వరి గుర్తు రాగానే నాకు యథావిధిగ ఆ

సంఘటనలు మనసులో మెదిలాయి.

పార్కులో ఒక మూలగా నా కెదురుగ లాన్ మీద కూర్చుంది రాజేశ్వరి,తల వంచుకుని పచ్చ గడ్డిని వేళ్ళతో తుంచుతూనే, నేనిా మాట్లాడకుండా మౌనంగా ఆ చేతుల వంకే చూస్తూ ఉండిపోయాను కాసేపటికి లేచి, "నే నింక వెళ్ళాలి బాబూ" అంది.

"ఏం అప్పుడేనా?"

"నాన్నగా రొచ్చే వేళకు ఇంట్లో ఉండాలి".

"అంత భయమా?"

"నీ కలాగే ఉంటుంది."

"మరయితే మన సంగతి మీ నాన్నగారి కెలా చెబుదామనుకుంటున్నావ్?"

"ఆ క్షణంలో నా కా ధైర్యం మెలాగూ వస్తుంది" వెళ్ళటానికి తయారయింది.

ఆటూ ఇటూ చూసి ఒకసారి ముద్దు పెట్టుకో బోయాను. నాకా అవకాశం ఇవ్వకుండా తప్పించుకుని తుర్రుమంది.

కాసేపు అక్కడా ఇక్కడా తిరిగి, కాలీడ్చుకుంటూ ఇల్లు చేరాను. నేను కాళ్ళు కడుక్కుని వచ్చేసరికే నాన్నగారూ, రమ భోజనాలు చేస్తూ ఉన్నారు. అమ్మ నా కూ్కడా వడ్డించేసరికి నేనూ ఉపక్రమించాను.

నాన్నగారే ముందు ఎక్కడి కెళ్ళావని అడిగారు. 'ఫ్రెండ్స్'ని చెప్పాను. ఒక్కసారి నా కళ్ళలోకి చూస్తూ, "ఇవ్వాళ మామయ్య దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. వాళ్ళ రాణి తెలుసుగా. . . ఎప్పుడూ చూసే ఉంటావ్. . . ఒక్కతే అమ్మాయి. నీ మీద వాళ్ళకు ఎంత ఇదో. ఒకసారి వెళ్ళి నాల్రోజు లుండి ఆ సంగతీ ఈ సంగతీ మాట్లాడి రాకూడదూ?" అన్నారు.

రాణి పేరు వినగానే ఎప్పట్లా ఎక్కడలేని చిరాకేసింది. కాని ఇప్పుడిక్కడ వాగ్వాదం ఎందుకని పైకి మాత్రం మామూలుగా, "ఆ సంగతీ ఈ సంగతి ఏం ఖర్మ? అసలు సంగతే మాట్లాడదాం" నన్నాను.

నేనో పెద్ద జోక్ వేసినట్లు నాన్నగారు విరగబడి నవ్వారు. రమ, మాత్రం నా కేసి అనుమానంగ చూసింది.

నాకా మరునాడే అనుకోకుండా ఆఫీసు పని మీద మద్రాసు వెళ్ళాల్సి వచ్చింది. చాలా హడావిడిగ బయలుదేరి వెళ్ళాను. 'సెంట్రల్'లో దిగగానే ముందు మామయ్య ఇంటికే వెళ్ళాను. 'రొటీన్ మాటలు' పూర్తయ్యాక, మొన్నటి ఉత్తరానికి సమాధానంగ రాణి పట్ల నా కలాంటి ఉద్దేశ మేదీ లేదని చెప్పాను. మామయ్య తల పంకించి 'సరే' నన్నాడు. రాణి నా కసలు కనపడనే లేదు. "అదృష్టవంతుణ్ణి" అనుకుని కాసేపు కూర్చుని వచ్చేశాను. తరవాత రెండు రోజుల్లో ఆఫీసు పని పూర్తి చేసి ఉదయాని కల్లా ఇంటికి చేరాను. భోజనం కాగానే విపరీతమైన నిద్ర ముంచు కొచ్చింది. నాలుగవుతుండగా లేచి స్నానం చేసి [illegible] బయటకు వెళ్ళటానికి సిద్ధమయ్యాను.

అప్పటికి నాన్నగారు ఆఫీసు నుండి, రమ కాలేజి నుండి ఇంకా రాలేదు. అసలు రమా, రాజేశ్వరి ఎప్పుడూ కాలేజి నుండి కలిసే వచ్చేవాళ్ళు. కాని రాజేశ్వరితో నా పరిచయం ప్రేమగా మారాక రాజేశ్వరి నన్ను పార్కులో కలుసుకోవాలనే ఉద్దేశ్య మున్నప్పుడల్లా రమను ముందు పంపి తాను ఆలస్యంగ వచ్చేది. ఈ సంగతి రమ పసి కట్టేసిందన్న సంగతి నాకు తెలుసు.

రాజేశ్వరితో మాట్లాడి మూడు రోజులయ్యిం దేమో, ఆతృతగ పార్కు చేరుకున్నాను. ధన్యుణ్ణి. రాజేశ్వరి ఒంటరిగానే వస్తూంది సీరియస్‌గ నడుచు కుంటూ. హుషారుగ నవ్వి పలకరించ బోయాను. కాని నా కోసం ఏ మాత్రమూ ఆగకుండా వెళ్ళటం ఆశ్చర్యం కలిగించింది.

"ఓహో. చెప్పకుండా మద్రాసు వెళ్ళినందుకు అలక కాబోలు."

వేగంగ నడిచి దగ్గర కెళ్ళి. "మరీ అంత కోపమా. నేను చెప్పే దేమిటా వినకుండా. . ." నా మాట లింకా పూర్తి కాలేదు.

"మువ్వింకేం చెప్పినా నా కనవసరం. అయినా కోపగించుకోవడానికి నే నెవర్ని?" బాగా కోపంగ అన్నా. ఎవరికీ వినబడకుండా కాస్త నెమ్మదిగా అంది.

రోడ్డు మీద జనం పలచగా వున్నారు. మమ్మె వ్వరూ గమనించటం లేదు.

అమ్మాయి కోపం తారా స్థాయికి చేరిందనుకుని కోపం పోగొట్టటానికి ఏదో ఏదో ప్రారంభించాను. రాజేశ్వరి టక్కున ఆగింది. కళ్ళు చింత నిప్పుల్లా ఉన్నాయి. "నాకు నిన్న ఒక సంబంధం నిశ్చయ మయింది. మర్యాదగా నాతో మరి కాసేపు నడిచా వంటే, నా అదృష్టాన్ని కూడా లేకుండా చేసిన ఘనత నీకే దక్కుతుంది" అంది చకచకా నడిచింది.

కొండ చరియల మీద నడుస్తున్న దాన్ని కాస్తా ఎవరో తోస్తే లోయలో పడ్డట్టయింది. రాజేశ్వరి మాట్లాడిందంతా అయోమయంగ తోచింది. అవ లేనిటి సడెన్‌గ ఇలా మారిపోయింది.

ఇంటి కెలా చేరుకున్నానో తెలియదు. కాసేపటికి తేరుకున్నాక "అమ్మా! నేను మద్రాసు వెళ్ళాక, రాజేశ్వరి మనింటి కేమైనా వచ్చిందా?" అనడిగాను.

"ఆ పిల్ల కేదో సంబంధం నిశ్చయమైనట్లుంది. ఇదివరకట్లాగ ఇప్పుడెలా వస్తుందిరా?" అంది అమ్మ.

'సరే' అనుకుని ఆలోచనలో పడ్డాను.

రాజేశ్వరిని మరోసారి కలుసుకుని అంతా వివరించా లనుకున్నాను. కాని రాజేశ్వరి నా కా అవకాశం ఇవ్వ లేదు. అదీకాక సంబంధం నిశ్చయమైందని తెలిశాక ఇప్పుడింకా ఏం మాట్లాడినా బాగుండదని వూరు కున్నాను.

రాణిని చేసుకునే ఉద్దేశ్యం నా కెంత మాత్రం లేదని ఇంట్లో ఖండితంగ చెప్పేశాను. నేను బాగా సీరియస్‌గ కనపడ్డం వల్లనో ఏమో నచ్చచెప్పే

భారతదేశంలో ప్రప్రథమంగా

శ్రమతక్కువ దీర్ఘకాలపు మన్నిక

బ్యాటరీ:

ఎక్సైడ్




సోలు వ్యాపారస్థులు:

GENELEC LIMITED

మద్రాసు కోయంబత్తూరు బెంగళూరు

ఎర్నాకులము సికింద్రాబాదు

MEMBER GEC GROUP

ఎక్సైడ్

తిరుగుతూంటుంది మిగతావి ఆగిపోయినా

RPS/GEN-5 TL

రెట్టించలేదు.

ఒక పది రోజుల తరవాత రాజేశ్వరి పెళ్ళి శుభలేఖ నాన్నగారి పేర వచ్చింది. దాన్ని తెరిచి చూడాలనిపించ లేదు. "గొప్పింటి సంబంధం" అనీ, "పెళ్ళయిన రెండు రోజులకే రాజేశ్వరి అత్తవారింటికి వెళ్ళి పోయిందని" మాటల సందర్భంలో అమ్మద్వారా తెలిసింది.

అనుకోని ఈ సంఘటన జరిగాక సహజంగానే నాకు స్త్రీ జాతి మీద విరక్తి కలిగింది. రాజేశ్వరి మీద కోపం కన్నా, అసలా నిర్ణయం ఎందుకు తీసుకుందో తెలియక పిచ్చెక్కినట్లయింది.

ఆ తరవాత ఏ అమ్మాయినీ నన్నాకర్షించ లేదు. రాజేశ్వరి కన్నా డబ్బున్న అందమైన సంబంధాలు చాలా వచ్చాయి. కాని రాజేశ్వరిలా వాళ్ళెవరూ నన్నంతగ ఆకర్షించలేక పోయారు. బహుశ ప్రేమ అంటే ఇదేనేమో.

రాను రాను నాకు మొదట్లో రాజేశ్వరి మీద ఉన్న కోపం, ద్వేషం మాయమయ్యాయి. రాజేశ్వరి తాలూకు జ్ఞాపకాలు, రాజేశ్వరిని ఇంకెప్పటికైనా చూడగలుగుతానా అన్న సందేహం మిగిలాయి.

ఆలోచనలు కట్టి పెట్టి డ్రెస్ చేసుకుని, రూమ్ తాళం వేసి ఆఫీసుకు బయలుదేరాను.

తరవాత రెండు రోజుల పాటు పక్కింటామె గొంతు మరో నాలు గయిదు సార్లు విన్నాక, ఆమె తప్పక రాజేశ్వరి అయ్యుండదా అన్న నిశ్చయాని కొచ్చాను. "ఒక వేళ రాజేశ్వరి భర్త ఉద్యోగం ఇక్కడే అయ్యుండొచ్చుకదా" అనుకున్న మెరిసింది ఆలోచన.

ఒకసారి ఆమెను చూస్తే తప్ప నా సందేహం నివృత్తి అయ్యే అవకాశం లేదు. నేను స్నానానికి పెరట్లోకి వెళ్ళినప్పుడుకూడా నా కామె కనపడేది కాదు. రెండు పోర్షన్లకీ మధ్య ఎత్తు గోడ ఉండటం వలన. నే నింటిలో ఉన్నంత సేపూ ఆమె అసలు బాల్కనీలో కొచ్చేది కాదు. ఆమె భర్త బాగా పొద్దు పోయాక ఇంటికి రావటం వలన ఒకటి రెండు సార్లు కంటె ఎక్కువ కనపడ లేదు. ప్రతీ రాత్రి ఏవో కేకలు మొత్తం మీద వినిపిస్తానే ఉండేవి.

ఆమెను ఒకసారి చూడాలన్న నా కోరిక ఫలించ డానికి ఆట్టే రోజులు పట్ట లేదు. తల నొప్పిగ ఉందని, పెర్మిషన్ తీసుకుని ఒక రోజు మధ్యాహ్నానికే ఇంటికి వచ్చాను. మేడ మెట్లెక్క బోతూ పైకి చూసిన నా గుండె దడదడ కొట్టుకుంది. నా వూహ నిజమే నన్నమాట. శూన్యం లోకి చూస్తూ బాల్కనీలో నిలబడ్డ రాజేశ్వరిని గుర్తించడానికి నా కెక్కువ సేపు పట్టలేదు.

ముందు ఆశ్చర్యం... తరవాత ఆనందం. తడబడే అడుగులతో పైకి చేరేసరికి అక్కడ రాజేశ్వరి లేదు.

నన్ను గమనించి లోపలికి వెళ్ళి పోయుండాలి. ఈ సమయంలో ఆమె భర్త ఉండడు. ఒకసారి నా కడ్డానికి ఇదే మంచి సమయం. మెల్లిగ వెళ్ళి వణుకుతున్న చేతులతో తలుపు తట్టాను.

తలుపు తీసి నా కెదురుగ నిలుచున్న రాజేశ్వరిని చూడగానే ఒక్కక్షణం మాట రాలేదు. పల్లని సాదా చీరె, అదే రంగు జాకెట్లో అతి సామాన్యంగ ఉంది. ఇదివరకటి మీద బాగా చిక్కినా, అంద మేమీ తరగ లేదు. మౌనంగా నాకో కుర్చీ చూపి, తను స్టూల్ లాక్కుని కూర్చుంది. కూర్చుని గదంతా కలియ చూశాను. టీ పాయ్ మీది బ్రాందీ సీసాలు, 'యాష్ ట్రే' లో కిక్కిరిసిన సిగరెట్ పీకలు ముందుగ నా దృష్టి నాకర్షించాయి. ఆమె భర్త గురించి నే నూహించేది రైటే నన్నమాట.

"చాన్నాళ్ళకు నిన్ను చూస్తున్నందుకు సంతోషంగ ఉన్నా, నీ పరిస్థితి చాలా బాధ కలిగిస్తోంది" ఎలాగో గొంతు పెగుల్చుకుని అన్నాను.

"నా కిదేం కొత్త కాదు. పెళ్ళయిన మూడో నాటి నుండీ రోజు ఇలాగే గడపటం నాకు బాగా అలవాటై పోయింది". రాజేశ్వరి కంఠంలో పెద్ద మార్పేమీ లేదు. కాస్త విచారం, గంభీరత తప్ప.

కొద్ది క్షణా లాగి తనే—

"రమ ఏం చేస్తోందిప్పుడు? నే నో రెండు ఉత్తరాలు రాశాను. సమాధానం లేదు" అంది.

"రమ ఇంకా ఇంట్లోనే ఉందనుకున్నావా? నీ పెళ్ళయిన రెండు నె లలకే తనూ పెళ్ళయి అత్త వారింటికి వెళ్ళిపోయింది."

తరవాత రమ పెళ్ళి గురించి విశేషా లడిగింది. సమాధానం చెప్పాక—

"మీ వారు ఏం ఉద్యోగం చేస్తారు?" అనడిగాను, ఏం అడగాలో తోచక. భర్త ప్రసక్తి రాగానే రాజేశ్వరి కొద్దిగ చికాకు పాలయ్యింది.

"పెళ్ళయిన రెణ్ణాళ్ళకే డబ్బు దుర్వినియోగం చేసినందుకు ఆయనను ఉద్యోగం లోంచి తీసేశారు. అప్పటినుండి మరికాస్త ఎక్కువగ తాగడం, ఒక్కోసారి రెండేసిరోజులుకూడా ఇంటికి రాకుండ పేకాడ్డం ఆయన ఉద్యోగం." మామూలు గానే చెప్పింది.

భర్త గురించి మరిన్ని వివరా లడిగి రాజేశ్వరిని ఇబ్బంది పెట్ట దలుచుకోలేదు.

"పిల్లలెందరు?" ఈ సారి తనే ప్రశ్నించింది.

"నా కసలు పెళ్ళి కాలేదని చెబితే నమ్ముతావా?"

ఆశ్చర్యంగ తల పైకెత్తింది. "నే నొకటడుగు తాను. సమాధానం చెబుతావా?" సూటిగ ముఖం లోకి చూస్తూ ప్రశ్నించాను. చెబుతా నన్నట్లు తలూపింది.

"నన్ను తోసి పుచ్చి, నువ్వా సంబంధం ఎందుకు ఒప్పుకున్నావ్?"

నా ప్రశ్నకు ఆశ్చర్య పోయింది. "నీకు నిజంగా తెలియదా?"

తెలియ దన్నట్లు తలూపాను. "వివరంగా చెప్పాలి."

"నువ్వు మద్రాసు వెళ్ళినట్లు రమ చెప్పగానే కారణం అడిగాను. రమ నువ్వు మీ మామయ్య కూతుర్ని చేసుకోవడానికి అంగీకరించావని చెప్పగానే నవ్వుతూ తేలిగ్గా కొట్టిపారేశాను. సరదాగా అని వుంటాననుకున్నాను. కాని రమ అసలు విషయం వివరంగా చెప్పగానే నాకు గుండె ఆగినంత పనయింది. ప్రేమ వ్యవహారాల్లో ఎందరో మగవాళ్ళు చేసిన మోసాలు కథల్లో చదివిన నేను అది నిజమే నను కున్నాను. రమ చెప్పిన చివరి మాటలు నా కింకా బాగా గుర్తున్నాయి. ఆ సంగతీ ఈ సంగతీ ఏం ఖర్మ—అసలు సంగతే మాట్లాడలేనని చెప్పి నువ్వు మద్రాసు వెళ్ళావట."

ఒక్కో మాట వింటున్న కొద్దీ కళ్ళు తిరుగు తున్నట్లయింది. నేనా రోజున సరదాగా నాన్నగారితో పలికిన మాటల పర్యవసానం ఇంత దారుణంగ ఉంటుం దని కల్లోకూడా గ్రహించ లేదు. అసలు రమ స్నేహితురాలి గానే రాజేశ్వరి నాకు పరిచయమయింది. మళ్ళీ రమ కారణంగానే మాకు ఎడబాటు సంభ వించిం దన్నమాట.

మా ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ విషయం బాగా తెలిసిన రమ నేను మద్రాసు వెళుతున్నప్పుడు పెళ్ళి విషయం నిశ్చయం చేసుకోడానికి అని ఎందు కంత దారుణంగ వ్యాహించగలిగింది?

నేను 'రూమాంటిసిజమ్'గ మాట్లాడ్డం, రమ ఆ విషయాన్ని అలా రాజేశ్వరి చెవిన వేయడం, రాజేశ్వరి ఆ విధంగ నిర్ణయం తీసుకోవడం—ఇవన్నీ ఒక దాని తరవాత ఒకటి నా జీవితాన్ని పెద్ద మలుపు తిప్పా యన్న మాట.

"తరవాత?" ఆలోచన నుంచి తేరుకుని నీరసంగ అన్నాను.

"తరవాత ఇంకేముంది? నువ్వు నన్ను మోసగించా వన్న కోపంలో నాన్నగారు ఎన్నాళ్ళ నుంచో చెబుతున్న సంబంధంఅంగీకరించాను. తరవాతదినీకూ తెలుసు" అని ముగించింది రాజేశ్వరి.

"అంటే, నేను మామయ్యతో మాటాడిన అసలు సంగతేమిట నీకు తరవాతకూడా తెలియ లేదన్న మాట."

తెలియ దంది రాజేశ్వరి.

"నేను రాజేశ్వరి అనే అమ్మాయిని పెళ్ళి చేసుకో బోతున్నానని, అందువలన మీ అమ్మాయిని చేసుకునే అవకాశం కాని, ఉద్దేశ్యం కాని లేదని చెప్పాను. అదీ అసలు సంగతి. నీకా విషయం చెబుదామనే మద్రాసు నుండి రాగానే ఆత్రతగ పార్కుకి. . ."

నా మాట పూర్తి కాక ముందే రాజేశ్వరి కళ్ళ వెంబడి అప్రయత్నంగా నీళ్ళు కారాయి. 'దే రీజ నో యూజ అవ్ క్రయింగ్ ఓవర్ స్పిల్ట్ మిల్క్' అనే సామెత రాజేశ్వరి ఎక్కువగ వాడుతూ ఉండేది. అందుకే నేమో అంతగ దుఃఖించకుండానే కన్నీళ్ళు తుడుచుకుంది.

"నా మూలంగ ఎంతో బాధ ననుభవించావు ఇన్నాళ్ళూ, ఐయామ్ రియల్లీ వెరీ సారీ మూర్తీ' తల దించుకుని.

"నాను రాజా! నీ తప్పేం లేదు. నేనా రోజున నాన్నగారితో నాకా సంబంధం వద్దు. నేను రాజేశ్వరిని చేసుకో బోతున్నానని సూటిగ చెప్పి ఉంటే, ఇదంతా జరిగేది కాదు." అని ఆగి,

"బాగా ముఖ్యమైన విషయాలు వివరంగా మాట్లాడు కోకపోవటం, తొందర పాటుతో నిర్ణయాలు తీసుకోవటం వల్ల జరిగే విపరీతమైన అనర్థాలు, మన విషయంలో మరోసారి రుజువు అయ్యాయి" అన్నాను. అవును. అంతకంటే ఇంకేం అనగలను?

*

---

కొన్ని పుస్తకాలు చనిపోయినా దూషితంకావు. అవి బతికే వాళ్ళ భ్రమల్ని కలిగిస్తూ వాతావరణాన్ని కలుషితం చేస్తుంటాయి.

— ఆర్నాల్డ్ బెనెట్